సాక్షి
విశాఖపట్నం

బుధవారం ; 27 ; ఆగస్టు ; 2025





వస్త్ర గణపతీ.. నమోనమామీ.. పాత గాజువాక లంకా గ్రౌండ్స్‌లో లక్ష చీరలతో ఏర్పాటు చేసిన 101 అడుగుల వినాయకుడు

న్యూస్‌రీల్

కేంద్ర రక్షణ శాఖ మంత్రికి స్వాగతం



మహారాణిపేట: తూర్పు నౌకాదళంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ విశాఖ వచ్చారు. ఆయనకు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

సింహగిరి మెట్ల మార్గం మూసివేత



కొండదిగువ తొలిపావంచా వద్ద మెట్లమార్గాన్ని మూసివేసిన దృశ్యం

సింహాచలం : సింహగిరి మెట్లమార్గాన్ని మంగళవారం దేవస్థానం అధికారులు మూసివేశారు. కురుస్తున్న వర్షాలకు మెట్లమార్గంలో భక్తులు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతాయన్న ఉద్దేశంతో దేవస్థానం అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. కొండదిగువ తొలిపావంచా వద్ద, కొండపైన మెట్లమార్గం ఎంట్రన్స్‌లోను గేట్లు అడ్డంగా పెట్టారు.

29న సీఎం విశాఖ రాక

మహారాణిపేట : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 29న విశాఖ వస్తున్నారు. ఉదయం 10 గంటలకు గుంటూరు నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.15 గంటలకు విశాఖలోని నేవల్ కోస్టల్ బ్యాటరీ హెలిపాడ్‌లో దిగుతారు. అక్కడ నుంచి నోవాటెల్ హోటల్‌కు వెళ్తారు. 11.45 గంటల నుంచి 12.45 గంటల వరకు ఇండియన్ ఫుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ సమ్మిట్‌లో పాల్గొంటారు. అనంతరం రుషికొండ రాడిసన్ బ్లూ హోటల్‌లో జరగనున్న నెట్‌వర్కింగ్ మార్కెట్ సమావేశంలో పాల్గొంటారు. తరువాత విమానంలో బెంగళూరు వెళ్తారు.

రేపటి నుంచి డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ఆరిలోవ: డీఎస్సీ–2025 ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఈ నెల 28 నుంచి జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమకుమార్ మంగళవారం తెలిపారు. ఉక్కునగరంలోని విమల విద్యాలయంలో ఉదయం 9 గంటల నుంచి పరిశీలన ప్రారంభమవుతుందని, అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కోసం పాఠశాలలో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రతి కౌంటర్‌లో ఎంఈవో, ప్రధానోపాధ్యాయుడితో పాటు డిప్యూటీ తహసీల్దార్ బృందం ఉంటుందన్నారు. అభ్యర్థుల కాల్ లెటర్లు https://apdsc.apcfss.in/ లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వాటిని డౌన్‌లోడ్ చేసుకుని సర్టిఫికెట్లతో పాటు అవసరమైన ధ్రువపత్రాలు, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన వాటికి సంబంధించిన మూడు జతల జిరాక్స్ కాపీలు, 5 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని డీఈవో సూచించారు.

నేడు అరకు వరకే కిరండూల్ పాసింజర్



తాటిచెట్లపాలెం: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా, ప్రయాణికుల భద్రత దృష్ట్యా విశాఖపట్నం–కిరండూల్–విశాఖపట్నం(58501/58502)పాసింజర్ రైలును బుధవారం అరకు వరకు మాత్రమే నడిపిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు అరకు–కిరండూల్ మధ్య రాకపోకలు సాగించదు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని సీనియర్ డీసీఎం కోరారు.

వర్షాల పట్ల అప్రమత్తం

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

మహారాణిపేట : జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసింది. 0891-2590100, 0891- 2590102 నెంబర్లలో సంప్రదించవచ్చని డీఆర్వో బి.హెచ్. భవానీ శంకర్ తెలిపారు. తేలికపాటి ఉరుములు, మెరుపులు, గంటకు 30–40 కిలో వేగంతో ఈదురుగాలులు, మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసినట్లు పేర్కొన్నారు.

గణాధిప నీకు మొక్కేదన్



గాజువాక కొత్త నక్కవానిపాలెంలో కోటి శివలింగాలతో 118 అడుగుల వినాయక విగ్రహం

- జిల్లాలో చవితి సందడి మొదలు
- అదిరిపోయే సెట్టింగ్‌లతో మండపాలు
- వాడవాడలా కొలువుదీరనున్న గణనాథులు
- మండపాలకు గణనాథుల ప్రతిమలు
- కిటకిటలాడుతున్న మార్కెట్లు
- వర్షంతో వ్యాపారులు, కొనుగోలుదారుల ఇబ్బందులు
- ఆకాశాన్నంటిన పూజా సామగ్రి ధరలు

విశాఖ సిటీ : ఓ బొజ్జ గణపయ్య.. నీ బంటు నేనయ్య.. అంటూ విఘ్నరాజు ఉత్సవాలకు నగరం ముస్తాబైంది. సర్వ విఘ్నాలను తొలగించే వినాయకుడు.. తొలి పూజ అందుకోవడానికి తాత్కాలిక మండపాలు, పందిళ్లలో కొలువుదీరాడు. వినాయక నవరాత్రి ఉత్సవాలకు విశాఖ సిద్ధమైంది. ప్రతి వీధిలోను సినిమా సెట్లను తలదన్నేలా మండపాలు సిద్ధమయ్యాయి. వాడవాడలా చవితి శోభ సంతరించుకుంది. వీధివీధిన విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు యువకులు పోటీపడ్డారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు ఇబ్బందులు పడ్డారు. అయితే కొంత మంది రెండు రోజులకు ముందే విగ్రహాలను మండపాలకు తరలించారు. మిగిలిన వారు మాత్రం వర్షంలోనే టార్పాలిన్‌లు కప్పి విగ్రహాలను తరలించాల్సి వచ్చింది.



మార్కెట్లు కిటకిట



మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఒక వైపు ఎడతెరిపి లేకుండా పడిన వర్షంతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రానికి కాస్త తెరిపివ్వడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. దీంతో సాయంతం 5 గంటల తర్వాత మార్కెట్లు, ప్రధాన జంక్షన్లు జనాలతో కిక్కిరిపోయాయి. పూర్ణామార్కెట్, సీతమ్మధార, అక్కయ్యపాలెం, ఎంవీపీ కాలనీ, కంచరపాలెం, గోపాలపట్నం, గాజువాక, ఇలా అన్ని ప్రాంతాలు కొనుగోలుదారులతో కళకళలాడాయి. కిరాణా, వస్త్ర, పండ్లు, పూల దుకాణాలు రద్దీగా కనిపించాయి. చవితి సామగ్రి విక్రయాలకు అనేక ప్రాంతాల్లో వ్యాపారులు ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేశారు.



పూర్ణా మార్కెట్‌లో పూల విక్రయాలు

1,097 వినాయక మండపాలకు అనుమతులు

జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

అల్లిపురం : వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోను, అన్ని జోనల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన జీవీఎంసీ సింగిల్ విండో క్లియరెన్స్ సెల్ ద్వారా 1,097 వినాయక మండపాలకు అనుమతులు మంజూరు చేసినట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. వినాయక చవితి పర్వదినాన్ని అందరూ సంతోషంగా పర్యావరణహితంగా జరుపుకోవాలని కోరారు. పూజానంతరం విగ్రహాలను ఇంటిలోని ఒక తొట్టెలో నీరు పోసి నిమజ్జనం చేయాలని, కాలనీల్లో చవితి పందిరిలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలను అదే కాలనీలో నీటి ట్యాంకర్ల ద్వారా నిమజ్జనం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నగరంలో భారీ గణనాథులు

వినాయక చవితి సందర్భంగా ఈ సారి నగరంలో విభిన్నమైన **భారీ వినాయక** విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. గాజువాకలో రెండు చోట్ల, బీచ్ రోడ్డు, దొండపర్తి, ఎంవీపీ, జ్ఞానాపురం, ఇలా అనేక ప్రాంతాల్లో భారీ గణనాథులు కొలువుతీరుతున్నాయి. ప్రధానంగా బీచ్ రోడ్డులో తిరుమల తిరుపతి దేవస్థానం సెట్‌తో వేసే మండపం ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఉత్తర భారతదేశం నుంచి ఆర్టిస్టులను తీసుకువచ్చి సెట్ వేశారు. ఇందులో ఇప్పటి వరకు విశాఖలో ఎన్నడూ లేని విధంగా వెండితో తయారు చేసిన 60 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అలాగే గాజువాక కొత్త నక్కవానిపాలెంలో కోటి శివలింగాలతో 118 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పాత గాజువాక జంక్షన్‌లో లక్ష చీరలతో 111 అడుగుల వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇదే విధంగా జిల్లా వ్యాప్తంగా అనేక చోట్ల విభిన్నమైన విగ్రహాలను ఏర్పాటుచేస్తున్నారు.



పండ్ల విక్రయాలు

ఆకాశాన్నంటిన ధరలు

ధరలు మాత్రం ఆకాశాన్నంటాయి. పూలు, పళ్లు, పత్రి, ఇలా అన్నింటి రేట్లు విపరీతంగా ఉన్నాయి. వినాయక ప్రతిమల ధరలు సైతం రెట్టింపు చేసేశారు. చిన్న విగ్రహం రూ.30కి విక్రయించారు. ఒకవైపు మట్టి విగ్రహాలను స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా పంపిణీ చేస్తున్నా.. వ్యాపారులు మాత్రం ధర తగ్గింపులో రాజీ పడలేదు. అలాగే చిన్న కొబ్బరికాయ రూ.30, దేశవాళీ అరటిపండ్లు డజను రూ.100, పాలవెల్లి రూ.40, పత్రి రూ.30 నుంచి రూ.50, యాపిల్స్ రూ.100కు మూడు.. ఇలా అన్నింటి ధరలు భారీగా ఉన్నాయి. పూజకు అవసరమయ్యే అన్ని పళ్లు, సామగ్రి కొనుగోలుకు ప్రాంతాన్ని బట్టి కనిష్ఠంగా రూ.1000 నుంచి రూ.1500 ఖర్చు చేయాల్సి వచ్చింది.



పూజా సామగ్రి

పట్టాలెక్కిన 'కవచ్' ఇంజిన్

- ఈస్ట్‌కోస్ట్ రైల్వేలో ఇదే తొలి 'కవచ్' లోకోమోటివ్
- దేశీయ పరిజ్ఞానంతో ప్రమాదాలు నివారించే అత్యాధునిక వ్యవస్థ
- 186 ఇంజిన్లకు 'కవచ్' ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం
- రైలు భద్రతలో వాల్తేర్ డివిజన్ కీలక ముందడుగు



లోకోను ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం లలిత్‌బోహ్రా

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్‌లో రైలు, ప్రయాణికుల భద్రత దిశగా వాల్తేర్ డివిజన్ కీలక ముందడుగు వేసింది. దేశీయంగా అభివృద్ధి చేసిన 'కవచ్'(రైలు ఢీకొనడాన్ని నివారించే వ్యవస్థ – టీసీఏఎస్) టెక్నాలజీతో కూడిన తొలి లోకోమోటివ్ (ఇంజిన్)ను మంగళవారం ప్రారంభించింది. ఎలక్ట్రికల్ లోకో షెడ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా ముఖ్య అతిథిగా హాజరై, డబ్ల్యూఏపీ–7 లోకోమోటివ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ ఘనతతో ఈస్ట్ కోస్ట్ రైల్వేలో 'కవచ్'వ్యవస్థను అమర్చిన తొలి డివిజన్‌గా వాల్తేర్ నిలిచింది. దశల వారీగా డివిజన్ పరిధిలోని మొత్తం 186 లోకోమోటివ్‌లకు ఈ భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇప్పటికే వాల్తేర్ లోకో షెడ్‌లో 600 మీటర్ల పొడవైన 'కవచ్' ఆధారిత టెస్టింగ్ ట్రాక్ అందుబాటులో ఉండటం ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయనుంది.

కాలానుగుణంగా మార్పులు

రైలు నియంత్రణ వ్యవస్థల్లో కాలక్రమేణా అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. 1980–90లో అమెరికాలో పాజిటివ్ ట్రైన్ కంట్రోల్ (పీటీసీ) వ్యవస్థను ప్రారంభించారు. 1990లో స్విట్జర్లాండ్‌లో యూరోపియన్ ట్రైన్ కంట్రోల్ సిస్టమ్(ఈటీసీఎస్), ఆస్ట్రేలియాలో ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్(ఏటీసీ) వ్యవస్థలు అందుబాటులోకి వచ్చాయి. భారతదేశంలో మొదటిగా 1986లో ముంబయి సబర్బన్ మార్గంలో ఆగ్జిలరీ వార్నింగ్ సిస్టమ్ (ఏడబ్ల్యూఎస్) ప్రవేశపెట్టారు. ఇందులో కొన్ని ప్రతికూలతలు బయటపడ్డాయి. దీంతో 2006లో నార్త్ ఫ్రాంటియర్ రైల్వేలో యాంటీ కొలిజన్ డివైస్(ఏసీడీ) ప్రవేశపెట్టినా.. ఆశించిన భద్రతా ఫలితాలు రాలేదు.

భారతీయ రైల్వేలో 'కవచ్' ఆవిర్భావం

ఈ నేపథ్యంలో పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో 'కవచ్' అభివృద్ధి చేశారు. 2014–15లో దక్షిణ మధ్య రైల్వేలో తొలిసారిగా 250 కి.మీ.మార్గంలో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభమైంది. 2015–16లో ప్యాసింజర్ రైళ్లపై విజయవంతంగా ట్రయల్స్ నిర్వహించారు. 2017–18లో 'కవచ్' 3.2 వెర్షన్‌కు ఆమోదం లభించింది. 2018–19లో ఈ వ్యవస్థను సరఫరా చేయడానికి మూడు సంస్థలకు ఆమోదం తెలిపింది.

2020లో 'కవచ్'ను జాతీయ ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థగా రైల్వే శాఖ అధికారికంగా గుర్తించింది. 2022 మార్చిలో నెట్‌వర్క్‌ను మరో 1,200 కి.మీ. మేర విస్తరించారు. 2024 జూలైలో అధునాతన 'కవచ్ 4.0' వెర్షన్‌కు ఆమోదం తెలిపి, విడుదల చేశారు. ఇప్పటివరకు దక్షిణ మధ్య రైల్వేలో సుమారు 1,465 కి.మీ.మార్గంలో, 144 లోకోమోటివ్‌లకు 'కవచ్' వ్యవస్థను ఏర్పాటు చేశారు. రాబోయే నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన మార్గాల్లోని లోకోలను 'కవచ్' పరిధిలోకి తీసుకురావాలని రైల్వే శాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది.

ఏమిటీ 'కవచ్' వ్యవస్థ?



కవచ్ పరికరం

'కవచ్'అనేది భారతీయ రైల్వే స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన ఒక ఆటోమేటిక్ రైలు పరిరక్షణ(ఏటీపీ) వ్యవస్థ. ఇది రైలు భద్రతలో కీలకమైన సిగ్నలింగ్ టెక్నాలజీ. మానవ తప్పిదాల కారణంగా జరిగే ప్రమాదాలను నివారించడం దీని ముఖ్య ఉద్దేశం. ఒకే ట్రాక్‌పై రైళ్లు ఎదురెదురుగా వచ్చినా.. రెడ్ సిగ్నల్‌ను లోకో పైలట్ గమనించకపోయినా, ఈ వ్యవస్థ స్వయంచాలకంగా ఇంజిన్ వేగాన్ని నియంత్రించి, బ్రేకులను వేసి రైలును సురక్షితంగా నిలిపివేస్తుంది.

ఇవీ ఉపయోగాలు

- భద్రతా నిర్వహణలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో కవచ్‌ను రూపొందించారు.
- లోకో పైలట్ సిగ్నల్‌ను గమనించకపోయినా లేదా నిర్లక్ష్యం చేసినా, ఈ వ్యవస్థ వెంటనే రైలును తన నియంత్రణలోకి తీసుకుని బ్రేకులు వేస్తుంది.
- ఒకే ట్రాక్‌పై ఎదురెదురుగా రైళ్లు వచ్చినప్పుడు.. రెండింటినీ సురక్షిత దూరంలో నిలిపివేస్తుంది.
- రైలు నిర్దేశిత వేగం కంటే ఎక్కువగా వెళ్తుంటే, ఆటోమేటిక్‌గా తగ్గిస్తుంది.
- అత్యంత విశ్వసనీయమైన వైర్‌లెస్ వ్యవస్థ ద్వారా సిగ్నల్, ఇంటర్‌లాకింగ్ వ్యవస్థలతో నిరంతరం అనుసంధానంగా ఉంటుంది.
- ఆటో విజలింగ్ సిస్టమ్ ద్వారా లెవెల్ క్రాసింగ్ గేట్ల వద్ద డ్రైవర్‌ను అప్రమత్తం చేస్తుంది.
- పొగమంచు వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో కూడా లోకోపైలట్‌కు స్పష్టమైన సిగ్నల్ సమాచారాన్ని అందిస్తుంది.

బార్లా.. మాకొద్దు

- ఆసక్తి చూపని వ్యాపారులు
- 29వ తేదీ వరకు గడువు పొడిగింపు



విశాఖ సిటీ : నిన్న మొన్నటి వరకు మద్యం వ్యాపారానికి పోటీ పడే వ్యాపారులు.. ఇప్పుడు దూరంగా పారిపోతున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన బార్ పాలసీ వైపు కన్నెత్తి చూడడానికి భయపడిపోతున్నారు. లైసెన్స్ ఫీజులు పెంచి.. కమీషన్లు తగ్గించి.. విచిత్ర పన్నులు విధించి.. వ్యాపారులను పీల్చి పిప్పి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో జిల్లాలో బార్ల ఏర్పాటుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. జీవీఎంసీ పరిధిలో 131 బార్లను కేటాయించారు. ఇందులో జనరల్ కేటగిరీకి 121, గీత కార్మికులకు 10 బార్లుగా నిర్ణయించారు. వీటికి ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులను ఆహ్వానించారు. మంగళవారంతో గడువు ముగిసినప్పటికీ.. ఇప్పటి వరకు 173 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. 42 బార్లకు 4 చొప్పున దరఖాస్తులు రాగా 5 బార్లకు ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. 74 బార్లకు ఒక్క దరఖాస్తు రాలేదు. దీంతో దరఖాస్తు గడువును ఈ నెల 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ప్రభుత్వం పొడిగించింది. 30వ తేదీన ఉదయం 8 గంటలకు వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో లాటరీ నిర్వహించనున్నారు.

కొత్త వ్యూహాలతో టైటాన్స్

- 29న తమిళ్ తలైవాస్‌తో ఆరంభ మ్యాచ్
- విశాఖలో ప్రో కబడ్డీ సందడి



మాట్లాడుతున్న టైటాన్స్ సీఈవో త్రినాథ్. చిత్రంలో చీఫ్ కోచ్ హుడా, కెప్టెన్ విజయ్

విశాఖ స్పోర్ట్స్: ప్రో కబడ్డీ ప్రీమియర్ లీగ్(పీకేఎల్) 12వ సీజన్‌లో తలపడేందుకు తెలుగు టైటాన్స్ జట్టు విశాఖ చేరుకుంది. ఈ సీజన్ విశాఖ వేదికగానే ప్రారంభం కానుండటం విశేషం. ఈ నెల 29వ తేదీ రాత్రి 8 గంటలకు తెలుగు టైటాన్స్, తమిళ్ తలైవాస్ మధ్య జరిగే తొలి పోరుతో లీగ్ ఆరంభమవుతుంది.

విశాఖలో తొలి దశ పోటీలు సెప్టెంబర్ 10వ తేదీతో ముగియనున్నాయి. గత సీజన్‌లో 1, 3, 5, 7, 9, 11లో నిలిచిన జట్లు గ్రూప్–బీలో ఉండగా, మిగిలిన ఆరు జట్లు గ్రూప్–ఏలో సీడింగ్ పొందాయి. 11వ సీజన్‌లో ఏడో స్థానంలో నిలిచిన టైటాన్స్ ఈసారి గ్రూప్–బీలో ఆడనుందని ఆ జట్టు సీఈవో త్రినాథ్ మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. లీగ్ దశలో ప్రతీ జట్టు మొత్తంగా 18 మ్యాచ్‌లను ఆడాల్సి ఉండగా, టైటాన్స్ జట్టు విశాఖలో ఐదు మ్యాచ్‌లు ఆడనుంది. ఇక్కడ మొత్తం 28 మ్యాచ్‌లు జరగనున్నాయి. సమావేశంలో టైటాన్స్ చీఫ్ కోచ్ కృష్ణకుమార్ హుడా, కెప్టెన్ విజయ్ మాలిక్, వైస్ కెప్టెన్ శుభం షిండే పాల్గొన్నారు.

ప్రతి మ్యాచ్‌కు ఫలితం ఖాయం

ప్రస్తుత సీజన్ నుంచి మ్యాచ్ ఫలితం కచ్చితంగా తేలనుంది. గతంలో మ్యాచ్ టై అయితే ఇరుజట్లకు పాయింట్లను సమంగా పంచేవారు. ఈ సీజన్ నుంచి మ్యాచ్ సమంగా ముగిస్తే.. విజేతను నిర్ణయించడానికి గోల్డెన్ రైడ్ తరహా టైబ్రేకర్ నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ప్రతి జట్టుకు ఐదేసి షూటౌట్ రైడ్‌లు ఇస్తారు. వాటిలో ఆధిక్యం సాధించిన జట్టును విజేతగా ప్రకటిస్తారు. అప్పటికీ ఫలితం తేలకపోతే.. టాస్ వేసి విజేతను నిర్ణయిస్తారు.

తెలుగు టైటాన్స్ జట్టు ఇదే..

కెప్టెన్ (ఆల్‌రౌండర్) విజయ్ మాలిక్, వైస్ కెప్టెన్ (డిఫెండర్) శుభం షిండే, డిఫెండర్లు అజిత్, సాగర్, అంకిత్, దుహాన్, ఆమెన్, అమీర్, రాహుల్, ఆల్‌రౌండర్లు శంకర్, భరత్, గణేష్, రైడర్లు చేతన్, నితిన్, ప్రఫుల్, జై భగవాన్, మన్జీత్, ఆశీష్...

టైటాన్స్ షెడ్యూల్ ఇలా..

12వ ప్రో కబడ్డీ సీజన్ ప్రారంభ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ జట్టు, తమిళ్ తలైవాస్‌తో ఈ నెల 29న పోర్ట్ ఇండోర్ స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల వెలుగులో తలపడనుంది. 30న యూపీ యోధాస్‌తో, సెప్టెంబర్ 4న జైపూర్ పింక్ పాంథర్స్‌తో, 7న బెంగాల్ వారియర్స్‌తో, 10న యు ముంబాతో తలపడనుంది. విశాఖ వేదికగా ఈ సీజన్ తొలి దశలో భాగంగా మొత్తం 28 మ్యాచ్‌లు జరగనుండగా, ప్రతి రోజూ రెండు మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

ఈసారి సరికొత్తగా..

జట్టు కూర్పు అయినప్పటి నుంచే ప్రాక్టీస్ ప్రారంభించాం. గత సీజన్‌లో ఉత్తమ ప్రదర్శన చేసిన విజయ్ మాలిక్‌ను కెప్టెన్‌గా నియమించాం. అతను జట్టును సమర్థంగా నడిపిస్తాడు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా లేనందున ప్రాక్టీస్‌కు కొద్దిగా అంతరాయం కలిగింది. అయితే మ్యాచ్‌లు ఇండోర్‌లో జరుగుతాయి కాబట్టి ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఈ సారి టైటాన్స్ మ్యాచ్‌తోనే సీజన్ ప్రారంభం కావడం ఆనందంగా ఉంది.


– త్రినాథ్, సీఈవో, తెలుగు టైటాన్స్

జట్టు సమతుల్యంతో ఉంది

ఈసారి జట్టును అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో పాటు యువ ఆటగాళ్లతో పటిష్ఠంగా కూర్పు చేశాం. వేలానికి ముందే ప్రణాళికాబద్ధంగా ఆటగాళ్లను ఎంచుకున్నాం. దీంతో రైడింగ్, డిఫెన్స్ విభాగాలను సమపాళ్లలో మేళవించి ఒక పటిష్ఠమైన జట్టును రూపొందించాం. ఈ జట్టు డిఫెన్స్‌లో నిలకడగా, రైడింగ్‌లో దూకుడుగా రాణిస్తుందని ఆశిస్తున్నాను. ఇప్పటికే జట్టు ప్రాక్టీస్ పూర్తి చేసుకుని విశాఖ చేరుకుంది.

– కృష్ణకుమార్ హుడా, టైటాన్స్ చీఫ్ కోచ్

తొలి మ్యాచ్ నుంచే పట్టు సాధిస్తాం



యువ ఆటగాళ్లను వ్యూహాత్మకంగా ఉపయోగించుకుంటేనే ఫలితాలు అనుకూలంగా వస్తాయి. ఆల్‌రౌండర్‌గా జట్టును ముందుకు నడిపిస్తూనే, డిఫెండర్లను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటాం. అందుకు తగిన విధంగా రైడింగ్‌లోనూ రాణిస్తాం. ప్లేఆఫ్‌లో స్థానం సంపాదించే దిశగా విశాఖ నుంచే మా ప్రస్థానం ప్రారంభిస్తాం. స్థానిక జట్టు కావడం మాకు కలిసివచ్చే అంశం. ఇప్పటికే ప్రాక్టీస్‌లో ఒక అవగాహనకు వచ్చాం. దాన్ని మైదానంలో అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

– విజయ్ మాలిక్, టైటాన్స్ కెప్టెన్

ముసురు ముంచెత్తింది

సాక్షి, విశాఖపట్నం : రెండు రోజులుగా ఏకధాటిగా మహా నగరాన్ని ముసురు ముంచెత్తింది. ఒడిశా సమీపంలో వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో సోమవారం మొదలైన వర్షం మంగళవారం సాయంత్రం వరకూ ఎడతెరిపి లేకుండా కురిసింది. జిల్లా వ్యాప్తంగా కురిసిన వర్షం కారణంగా పలు రహదారులు జలమయమయ్యాయి. నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో వరదనీరు పోటెత్తింది. గెడ్డలు, మురుగు కాలువలు పొంగిపొర్లాయి. బుధవారం వినాయక చవితి కావడంతో పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వినాయక మండపాలు నిర్మించేందుకు భక్తులు అష్టకష్టాలు ఎదుర్కొన్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు కాస్తా తెరిపినివ్వడంతో ప్రజలంతా ఒక్కసారి రోడ్లపైకి వచ్చారు. దీంతో నగరం ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. వినాయక విగ్రహాలు ఊరేగింపుగా తీసుకెళ్లేందుకు, పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు భక్తులు మార్కెట్‌లోకి పోటెత్తారు. బుధవారం ఉదయం వర్షం కురిసి.. మధ్యాహ్నం లేదా సాయంత్రానికి వర్షం తగ్గుముఖం పట్టనుందని విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం అధికారులు వెల్లడించారు.

మంగళవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కురిసిన వర్షపాతం

ప్రాంతం	వర్షపాతం (మిమీ.ల్లో)
భీమిలి	59.6
మహారాణిపేట	52.2
పెందుర్తి	51.8
ములగాడ	51.4
గాజువాక	51.4
ఆనందపురం	51.2
పెదగంట్యాడ	51.0
ఆరిలోవ	50.6
సీతమ్మధార	48.6
గోపాలపట్నం	44.2
పద్మనాభం	39.8
జిల్లాలో మొత్తం వర్షపాతం	551.8









జోరు వానలోనూ.. నగరంలో మంగళవారం ఎడతెరిపిలేకుండా వర్షం కురవడంతో వినాయక పూజకు కావాల్సిన సామగ్రి కోసం ప్రజలు గొడుగులు వేసుకొని పూర్ణామార్కెట్‌కు పోటెత్తారు.

కుమార్తెలు, మరిదే హంతకులు

- వీడిన మహిళ హత్య కేసు మిస్టరీ
- ఆస్తి తగాదాలే కారణం
- వెల్లడించిన అనకాపల్లి ఎస్పీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా, వెనుకన నిందితులు

అనకాపల్లి: గాజువాక మండలం, కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్ ప్రాంతానికి చెందిన బంకిళ సంతు(37) హత్య కేసు మిస్టరీ వీడింది. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలతోపాటు కుటుంబానికి చెడ్డ పేరు తీసుకొస్తోందన్న అనుమానంతో ఆమెను ఇద్దరు కూతుళ్లు, మరిది హతమార్చినట్టు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కూర్మన్నపాలెం, దువ్వాడ, రాజీవ్‌నగర్‌కు చెందిన బంకిళ సంతు, ఇద్దరు కుమార్తెలు అనూష, మైనర్ కుమార్తె, మరిది మురళీధర్‌లు కలిసి ఉంటున్నారు. సంతు భర్త ఖతర్‌లో ఉద్యోగ రీత్యా ఉన్నాడు. సంతు కుటుంబంలో ఆస్తి తగాదాలు, ఆర్థిక సమస్యలపై తరుచూ వివాదాలు పడుతున్నారు. భార్యాభర్తల మధ్య దాంపత్య బంధం సరిగా లేకపోవడంతో భర్త ఖతార్ వెళ్లిపోయాడన్న ఆరోపణలున్నాయి. గతంలో భర్తపై సంతు పోలీస్ కేసు కూడా పెట్టింది. ఇద్దరు కూతుళ్లతోనూ కొంతకాలంగా గొడవలు పడుతోంది. గతంలో ఆస్తిని కూడా అమ్మకాలు చేశారు. ఈ విషయంపై కూర్మన్నపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. ఆస్తి అమ్మగా వచ్చిన సొమ్మును సంతు దుర్వినియోగం చేసి, కుటుంబానికి చెడ్డపేరు తీసుకొస్తోందని ఇద్దరు కూతుళ్లు, మరిది కోపంతో ఉన్నారు. ఈ నెల 13న చిన్న కూతురు హాస్టల్ నుంచి ఇంటికి వచ్చింది. తల్లికి చెందిన సెల్‌ఫోన్ చూడగా అసభ్యకరమైన ఫొటోలు, కాల్ రికార్డులు చూసి షాక్‌కు గురై అక్కడే ఉన్న అక్క అనూషకు తెలిపింది. కూతుళ్లు, మరిది కలిసి సంతును ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నారు. ఇంట్లో నిద్రిస్తున్న సంతును ఈ నెల 13వ తేదీ అర్ధరాత్రి ఇద్దరు కూతుళ్లు, మరిది హత్య చేశారు. 14వ తేదీ తెల్లవారుజామున మురళీధర్ స్నేహితుడైన మోహన్ కారులో మృతదేహాన్ని దువ్వాడ మీదుగా సబ్బవరం మండలం వేట జంగాలపాలెం గ్రామానికి తీసుకెళ్లి పెట్రోల్ పోసి తగలబెట్టినట్లు ఎస్పీ వెల్లడించారు. సెల్‌ఫోన్ డేటా ఆధారంగా సంతు హత్య కేసును ఛేదించినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబర్చిన పోలీస్ సిబ్బందిని ప్రశంసా పత్రాలతో ఎస్పీ అభినందించారు. సమావేశంలో పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ విష్ణుస్వరూప్, సబ్బవరం సీఐ రామచంద్రరావు, సీసీఎస్ సీఐ అప్పలనాయుడు, ఎస్ఐలు సింహాచలం, ప్రసాదరావు, రామకృష్ణ, రమేష్, స్టేషన్ సిబ్బంది శ్రీనివాసరావు, సతీష్ కుమార్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సెజ్ ఉద్యోగి మృతి



వీరబాబు(ఫైల్)

పరవాడ: స్థానిక తహసీల్దార్ కార్యాలయ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ట్యాంకర్ లారీ వెనుక చక్రాల కింద పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం కూనవరం గ్రామానికి చెందిన సుంకర వీరబాబు(38)గా గుర్తించారు. ఈయన అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లోని మెట్రోకెమ్ పరిశ్రమ ప్రొడక్షన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు తెలిపిన వివరాలు. అచ్యుతాపురం నుంచి తన ద్విచక్ర వాహనంపై లంకెలపాలెం వైపు వెళ్తున్న క్రమంలో ముందు ఉన్న ట్యాంకర్ లారీని తప్పించే క్రమంలో అదుపుతప్పి ఆ లారీ కింద పడిపోవడంతో మృతుడి ఎడమ కాలు మీదుగా లారీ వెనుక చక్రాలు వెళ్లిపోయాయి. ప్రమాదంలో తీవ్ర రక్త స్రావం అయింది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గాజువాకలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు పరవాడ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

మోటారు సైకిళ్లు, ఆటో చోరీ

నిందితుడికి 14 నెలల జైలు శిక్ష

భీమునిపట్నం: భీమిలి పరిధిలో మోటారు సైకిళ్లు, ఆటో చోరీకి పాల్పడిన నిందితుడికి కోర్టు 14 నెలల జైలు శిక్ష విధించింది. దీనికి సంబంధించి మంగళవారం క్రైం ఎస్ఐ సూర్య ప్రకాష్ తెలిపిన వివరాలివి. పాత మధురవాడ మెట్లకు చెందిన టీకుపూడి కనకరాజు గత సంవత్సరం ఆగస్టు నుంచి అక్టోబర్ మధ్య మంగమారిపేట, సంగివలస ప్రాంతాల్లో ఇళ్ల బయట ఉన్న రెండు బైకులను, తగరపువలస వద్ద ఒక ఆటోను చోరీ చేశాడు. అతన్ని అక్టోబర్ 16న పీఎంపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. నేరం రుజువు కావడంతో భీమిలిలోని ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ పి.స్వామి భవాని నిందితుడికి 14 నెలల జైలు శిక్షతో పాటు రూ.3వేలు జరిమానా విధించారు.

చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు

విశాఖ లీగల్ : ముక్కు పచ్చలారని చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్లు కఠిన కారాగార శిక్ష విధిస్తూ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి మంగళవారం తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించిన పక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. బాధిత బాలికకు రూ.3 లక్షలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తి రాజశేఖర్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు సరగడ సన్యాసిరావు(45) భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలోని తాటితూరి గ్రామ నివాసి. చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. బాధిత చిన్నారి (8) వేసవి సెలవులకు తన అమ్మమ్మ ఇంటికి వచ్చింది. గత ఏడాది ఏప్రిల్ 30 తేదీ ఉదయం తన అమ్మమ్మతో కలిసి పశువులకు కాయడానికి రాజు గారి తోట దగ్గరకు వెళ్లింది. సమీపంలో చిన్నారి ఆడుకుంటుంది. అదును చూసిన సన్యాసిరావు చిన్నారిని తన బైక్‌పై సమీపంలోని మొక్కజొన్న తోటలోకి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తీవ్ర రక్తస్రావంతో ఉన్న బాలికను ఏమి జరిగిందని అమ్మమ్మ అడగ్గా సన్యాసిరావు గురించి చెప్పింది. బాలిక అమ్మమ్మ ఫిర్యాదు మేరకు భీమిలి దిశ పోలీస్ ఏసీపీ సిహెచ్ వివేకానంద కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు.

సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కార్యదర్శిగా ఏజే స్టాలిన్

అల్లిపురం: రాష్ట్ర సీపీఐ 28వ మహాసభలు ఒంగోలులో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు జరిగాయి. ఈ మహాసభల్లో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శిగా జీవీఎంసీ సీపీఐ కార్పొరేటర్, సీపీఐ పక్ష నాయకుడు ఏజే స్టాలిన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఏ విమల, రాష్ట్ర సమితి సభ్యుడిగా పార్టీ సీనియర్ నాయకుడు, విశాఖ కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు చలసాని రాఘవేంద్రరావు, పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే రహిమాన్, మాజీ జిల్లా కార్యదర్శి, ప్రస్తుత జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని రాష్ట్ర సమితి సభ్యుడు ఎం. పైడిరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో యువజన విభాగం కీలకం

పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు



రాష్ట్ర యువజన విభాగం జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ అదీప్‌రాజ్‌ను సన్మానిస్తున్న పార్టీ అధ్యక్షుడు కేకే రాజు

మహారాణిపేట: రాష్ట్ర యువజన విభాగం జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ యువజన విభాగం సభ్యులతో కలిసి పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజును పార్టీ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ 2024 ఎన్నికల సమయంలో కూటమిగా ఏర్పడిన టీడీపీ, బీజేపీ, జనసేనలు యువతకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామని తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 13 నెలలు అవుతున్న హామీలు అమలు చేయలేదన్నారు. యువత పక్షాన నిలిచి, కూటమి హామీల అమలుకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. యువజన విభాగం సమర్థవంతమైన యువకులను పార్టీ పదవుల్లో నియమించి, యువజన విభాగాన్ని పటిష్టం చేయాలన్నారు. పార్టీలో యువజన విభాగం పాత్ర చాలా కీలకమన్నారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జోనల్ అధ్యక్షుడు అంబటి శైలేష్, విశాఖ జిల్లా నియోజకవర్గాల యువజన విభాగం అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్‌ను కేకే రాజు సన్మానించారు. అదీప్‌రాజ్ పార్టీ అధ్యక్షుడు కేకే రాజుకు ఆత్మీయ సత్కారం చేశారు.

జర్నలిస్టులు సమాజ ప్రగతి సాధకులు



జర్నలిస్టులకు మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేస్తున్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

దాబాగార్డెన్స్: జర్నలిస్టులు సమాజ ప్రగతికి కృషి చేసే సాధకులని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం తమ వంతు సహకారం అందిస్తుందని వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ అన్నారు. మంగళవారం ఆశీల్‌మెట్ట జంక్షన్‌లోని వేమనమందిరంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్, ఏపీ స్మాల్ అండ్ మీడియం న్యూస్‌పేపర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు మట్టి వినాయక విగ్రహాలు, వ్రతకల్ప పుస్తకాలు, వివిధ రకాల పండ్ల మొక్కలు, మిఠాయిలను పంపిణీ చేశారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నారాయణ్ మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా జర్నలిస్టులకు గణేష్ పూజా సామాగ్రిని అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

యువకుడిని రక్షించిన అమనాం వాసులు



వరద నీటిలో కొట్టుకుపోతున్న యువకుడిని రక్షిస్తున్న గ్రామస్తులు

తగరపువలస: తగరపువలస–శ్రీకాకుళం జాతీయ రహదారి నుంచి భీమిలి మండలం అమనాం పంచాయతీకి వెళ్లే రహదారిలో ప్రవహిస్తున్న గెడ్డ నీటిలో కొట్టుకుపోతున్న యువకుడిని అమనాం గ్రామస్తులు సాహసం చేసి రక్షించారు. అమనాం రహదారిపై పొందుతున్న గెడ్డ మార్గంలో యువకుడు మంగళవారం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రవాహ వేగానికి కొట్టుకుపోతుండగా చూసిన అమనాం ప్రజలు రక్షించారు.

- ఆనందపురం మండలం పందలపాక పంచాయతీ పైలపేటలో డ్రైనేజీల నిర్మాణాల కోసం తవ్విన గోతుల వర్షంతో నిండి ఇళ్లలోకి ప్రవేశించడంతో సుమారు వంద కుటుంబాల ప్రజలు ఇబ్బంది పడ్డారు.

అగ్నిమాపక కేంద్ర నిర్మాణానికి శంకుస్థాపన


కొమ్మాది: ఎండాడ జాతీయ రహదారి సమీపంలో అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి మంగళవారం హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు రూ.2.25 కోట్ల వ్యయంతో ఈ అగ్నిమాపక కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కేంద్రాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. వికలాంగుల పింఛను తొలగింపుపై జరుగుతున్న వివాదంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. ఎటువంటి ఆధారాలు లేకుండా వికలాంగుల పింఛన్ల తొలగింపుపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. అర్హులైన వికలాంగులకు పింఛను తొలగించమన్నారు. ఎమ్మెల్సీ చిరంజీవి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ట్రెజరీ సిబ్బంది.. టైమ్‌కు రారు

- రాష్ట్ర ఖజానా శాఖ డైరెక్టర్ తనిఖీల్లో వెలుగులోకి..
- సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని నిర్ణయం

మహారాణిపేట: జిల్లా ట్రెజరీ ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరు కావడం లేదన్న విమర్శలు ఎప్పటినుంచో ఉన్నాయి. తాజాగా రాష్ట్ర ఖజానా శాఖ సంచాలకుడు ఎస్.మోహనరావు తనిఖీల్లో సిబ్బంది నిర్లక్ష్యం వెలుగుచూసింది. జిల్లా ట్రెజరీ కార్యాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేయగా.. ఆ సమయంలో సిబ్బంది చాలా తక్కువ మంది ఉండటంపై డైరెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం 10.20 గంటలకు మోహనరావు జిల్లా పరిషత్ సమీపంలోని ట్రెజరీ కార్యాలయానికి చేరుకున్నారు. ఆ సమయంలో కొద్ది మంది మాత్రమే ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణంగా 10.30 గంటలకు సిబ్బంది విధులకు హాజరు కావాల్సి ఉండగా, అంతకు ముందే ఆయన తనిఖీకి వెళ్లారు. 10.30 గంటలకు హాజరు కాని సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు. డైరెక్టర్ తనిఖీకి వెళ్లిన సమయంలో జిల్లా ట్రెజరీ అధికారి వై.సుధాకరరావు పీజీఆర్ఎస్ కోసం కలెక్టరేట్‌లో ఉన్నారు. రాష్ట్ర డైరెక్టర్‌ను స్వాగతం పలకడానికి ఎవరూ లేకపోవడం, సిబ్బంది విధులకు హాజరు కాకపోవడం ట్రెజరీ శాఖలో తీవ్ర చర్చకు దారితీసింది. అలాగే సీతమ్మధార ఏటీవో కార్యాలయంలో ప్రీ–ఆడిట్‌లో పట్టుబడిన పలు తప్పులకు సంబంధించిన ఫైళ్లను కూడా ఆయన పరిశీలించారు. మధ్యాహ్నం 2 గంటల వరకు పెన్షన్, ప్రీ–ఆడిట్, ఇతర రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

బాలుకి బళ్లారి రాఘవ జాతీయ పురస్కారం



పద్మనాభం: విజయనగరం జిల్లా, మద్ది గ్రామానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు సామవేదం బాల సుబ్రహ్మణ్యం (బాలు) ప్రతిష్టాత్మకమైన బళ్లారి రాఘవ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ అవార్డును కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి రాఘవ కల్చరల్ యాక్టివిటీస్ అసోసియేషన్ తమ 53వ వార్షికోత్సవం సందర్భంగా అందించనుంది. బాల సుబ్రహ్మణ్యం వచ్చే నెల 6న బళ్లారిలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. వృత్తిరీత్యా పురోహితుడైన బాల సుబ్రహ్మణ్యం రంగస్థల కళాకారుడిగా 'పద్మ' నాటకాల్లో అనేక ప్రదర్శనలిచ్చి బిరుదులు అందుకున్నారు. ఆయన 'అనంత పద్మనాభ నాటక కళాకారుల సంఘం' వ్యవస్థాపక అధ్యక్షుడిగా, 'తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్' గౌరవ అధ్యక్షుడిగా కూడా సేవలందించారు. ట్రస్ట్ ద్వారా ఉత్తరాంధ్రలోని మారుమూల ప్రాంతాల్లోని ఎందరో మట్టిలో మాణిక్యాల్లాంటి కళాకారులను ఆయన ప్రోత్సహించారు.

సీఆర్ఎస్ పోర్టల్‌లో జనన, మరణ నమోదు తప్పనిసరి

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్



దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలోని జనన, మరణ నమోదుకై అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్స్, క్లినిక్స్ సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్(సీఆర్ఎస్) పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే సీఆర్ఎస్ లాగిన్‌లో నమోదైనవి మినహా, మిగిలిన వారు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ వల్ల జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో ప్రజలకు సేవలు అందించేందుకు సౌకర్యంగా ఉంటుందన్నారు. జనన, మరణాలతో సంబంధం ఉన్న ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, క్లినిక్‌లు సీఆర్ఎస్ పోర్టల్ యూజర్ ఐడీల కోసం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ప్రజారోగ్య విభాగంలో సంప్రదించాల్సిందిగా సూచించారు. 15 ఏళ్లు దాటిన బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రంలో బిడ్డ పేరు నమోదు తప్పనిసరన్నారు. 15 ఏళ్లు దాటిన పిల్లల పేర్లను ఇంకా నమోదు చేయని వారు వచ్చే ఏడాది జనవరి 21లోపు తమ బిడ్డ పేరు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. లేకుంటే ఆ తర్వాత అలాంటి వారు పేర్లు నమోదు చేసేది లేదని స్పష్టం చేశారు.

అక్రమాలకు అడ్డాగా వెలగపూడి ఫామ్‌హౌస్

కాంగ్రెస్ ఇన్‌చార్జి ప్రియాంక దండి ధ్వజం

ఆరిలోవ: రుషికొండలో ఉన్న తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఫాంహౌస్ అక్రమాలు, దందాలకు అడ్డాగా మారిందని కాంగ్రెస్ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రియాంక దండి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. నియోజకవర్గం అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం గురించి ఆలోచించాల్సిన ఎమ్మెల్యే.. మద్యం, భూముల అక్రమ విక్రయాల్లో మునిగిపోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఈ దందాలు మొదలయ్యాయని ఆరోపించారు. ఎమ్మెల్యే ప్రధాన అనుచరులైన కాళ్ల శంకర్, నాగరాజులు పోలీసుల సహకారంతో అక్రమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.

ప్లాస్టిక్ బ్యాట్లలో గంజాయి నింపి..

ఇద్దరు మహిళలను అరెస్టు చేసిన జీఆర్పీ పోలీసులు



ప్లాస్టిక్ బ్యాట్లలో గంజాయిని స్వాధీనం చేసుకున్న జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

తాటిచెట్లపాలెం: గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని పోలీసులు తీవ్రంగా ప్రయత్నిస్తుంటే, స్మగ్లర్లు మాత్రం కొత్త కొత్త మార్గాలను అన్వేషిస్తూ పోలీసులకు సవాలు విసురుతున్నారు. తాజాగా విశాఖ రైల్వే స్టేషన్‌లో జరిగిన తనిఖీల్లో పోలీసులు కూడా ఊహించని విధంగా గంజాయిని తరలిస్తున్న తీరు వెలుగులోకి వచ్చింది. మంగళవారం జీఆర్పీ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ సిహెచ్. ధనుంజయ నాయుడు నేతృత్వంలో జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి, ఆర్పీఎఫ్ ఎస్ఐ పీఆర్ బిశోయి తమ బృందంతో కలిసి ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు మహిళలు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లాకు చెందిన ఈసమేతర ఖతున్, ఒడిషాలోని గంజాం జిల్లాకు చెందిన గీత నాయక్గా గుర్తించారు. వారి బ్యాగులు, ఇతర వస్తువులను పరిశీలించగా, పోలీసులు విస్తుపోయారు. ఈ మహిళలు తమ పిల్లలు ఆడుకునే ప్లాస్టిక్ బ్యాట్ల హ్యాండిళ్లను కట్ చేసి అందులో గంజాయిని నింపి.. టేప్‌తో అతికించి, దానిపై రబ్బరు తొడుగును అమర్చారు. కేరళకు గంజాయి తరలించేందుకు వారు ఈ పద్ధతిని అనుసరిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ విధంగా మొత్తం రూ. 90వేలు విలువైన 18 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించారు.

